క్లుప్తంగా

నందిన్నె జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎంగా రెడ్యానాయక్

కేటీదొడ్డి: మండలంలోని నందిన్నె ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా రెడ్యానాయక్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన హెచ్‌ఎం మహేష్ ఇటీవల బిజ్వారం పాఠశాలకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు రెడ్యానాయక్‌కు హెచ్‌ఎం బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది ఆయనను సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నర్సింహులు, కృష్ణయ్య, వీరేష్, గణేష్, స్వర్ణలత, రేణుక, సందీప్ పాల్గొన్నారు.

ఉప్పేరు హెచ్‌ఎంగా నారాయణరావు

ధరూరు: మండలంలోని ఉప్పేరు ఉన్నత పాఠశాల ఎఫ్ఏసీ హెచ్‌ఎంగా నారాయణరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సుజాత, లోకమ్మ, రాజ్యలక్ష్మి, స్వప్న, గౌరీశంకర్, సాయిసుధాకర్, ఇస్మాయిల్, ప్రతాప్‌సింహ, సంపత్‌కుమార్, శివకుమార్, బద్రుద్దీన్, రాజేందర్, మధుసూదన్, జగదీశ్వరాచారి, బాలకిషన్, మౌలానాబీ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉర్సు



అయిజ: మండలంలోని పర్దీపురం గ్రామ సమీపంలో హజరత్ ఖాజా సయ్యద్‌బాబా పకీర్‌వలీ దర్గా ఉర్సు శుక్రవారం వైభవంగా కొనసాగింది. ఈ సందర్భంగా మూడు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. చివరి రోజున ఫాతెహాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులతో దర్గా పరిసర ప్రాంతం కిటకిటలాడింది. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నానో యూరియాపై అవగాహన

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ అయూబ్ మాట్లాడుతూ నానో యూరియా వాడకంతో పంట దిగుబడి పెరుగుతుందన్నారు. మొక్కలకు ఎక్కువ శాతం నత్రజని అందుతుందని తెలిపారు. 500ఎం.ఎల్. నానో యూరియాలో 40వేల పీపీఎమ్ నైట్రోజోన్ ఉంటుందన్నారు. యూరియా బస్తా కంటే తక్కువ ధరలో లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు, రైతు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆకర్షితులై చేరిక

గద్వాల రూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మల్దకల్ మండలం నీలిపల్లికి చెందిన పలువురు పార్టీలో చేరగా, వారికి కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని గంజిపేటకు చెందిన సోహెబ్ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.3లక్షల ఎల్‌ఓసీని అందజేశారు. కార్యక్రమంలో అజయ్, ఏలీష, రాజేశ్, శంకర్, మల్లేష్, తిమ్మప్ప ముదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

అలంపూర్: ప్రజారోగ్య సంరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని ఎమ్మెల్యే వీఎం అబ్రహం అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం 80మందికి రూ.33,85,200 విలువైన సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపత్కాలంలో పేదలకు సీఎంఆర్‌ఎఫ్ అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. పేదల సంక్షేమానికి సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడాలేని పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. అన్నివర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్న ప్రభుత్వానికి ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు. ఎంపీపీలు బేగం, రజిత, వైస్‌ఎంపీపీలు రేణుక, దేవన్న, నాయకులు సుంకన్న, వెంకట్‌గౌడ్, రమణ పాల్గొన్నారు.

మంచు కురిసే వేళలో..



ఉండవెల్లి: మండల కేంద్రం సమీపంలోని జాతీయ రహదారిని శుక్రవారం పొగమంచు కప్పేసింది. వాహనదారులు లైట్లు వేసుకొని ప్రయాణం సాగించారు. పంట పొలాలు, వీధుల్లో పొగమంచును చూసి అప్పుడే చలికాలం వచ్చిందా అని పలువురు చర్చించుకున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కేటీదొడ్డి: అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఎస్‌ఐ వెంకటేష్ వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన చాకలి రఘు ట్రాక్టర్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా, కేజీబీవీ సమీపంలో పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, యజమాని రఘుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గంగమ్మ ఒడికి గణనాథుడు

● నయనానందంగా సాగిన నిమజ్జనోత్సవం



గద్వాలలో గణనాథుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి



గద్వాలలో గణేశ్ నిమజ్జనోత్సవంలో పాల్గొన్న చిన్నారులు



ఎర్రవల్లి కూడలిలో గణనాథుడికి పూజలు చేస్తున్న కమాండెంట్ సాంబయ్య



పైపాడులో గణనాథుడి శోభాయాత్రలో పాల్గొన్న ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్

గద్వాల: జై బోలో గణేశ్ మహారాజ్‌కీ జై.. గణపతి బొప్ప మోరియా.. అంటూ భక్తుల నినాదాలతో గద్వాల పురవీధులు పులకించాయి. ఐదు రోజులపాటు అశేష పూజలందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడికి చేరుకున్నాడు. జిల్లా కేంద్రంలోని పలు వీధుల్లో ప్రతిష్ఠించిన గణనాథులను శుక్రవారం రాత్రి నిమజ్జనం చేశారు. నిమజ్జనోత్సవంలో యువత ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని నృత్యాలతో హోరెత్తించారు. అంతకుముందు గణనాథుడికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ ఇతర ప్రజాప్రతినిధులు గణనాథులను దర్శించుకున్నారు. మార్కెండేయస్వామి ఆలయంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుడి లడ్డూకు వేలం నిర్వహించారు. వ్యాపారి ఒగ్గు వెంకటేష్ రూ.1.29,999లకు వేలంపాడి లడ్డూను దక్కించుకున్నారు.

అలంపూర్ రూరల్: మండలంలోని కాశీపూర్ బొమ్మనికాలనీలో గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నిమజ్జనం చేశారు. శింగవరం–1 గ్రామంలో వినాయకుడి లడ్డూకు వేలం నిర్వహించగా, హరికృష్ణ అనే వ్యక్తి రూ.65వేలకు దక్కించుకున్నారు. అనంతరం గణనాథుడి నిమజ్జనోత్సవం నిర్వహించారు. నాగభూషణం, సాయిరాం, రామాంజనేయులు, రమేష్, శివ పాల్గొన్నారు.

అయిజ: మండలంలోని పలు గ్రామాల్లో గణేశ్ నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని గుర్రంతోటవీధిలో గణనాథుడిని మున్సిపల్ కమిషనర్ నర్సయ్య దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వినాయకుడి లడ్డూలకు వేలం నిర్వహించగా, పలువురు పోటీపడి దక్కించుకున్నారు.

రాజోళి: మండలంలోని పలు గ్రామాల్లో కొలువుదీరిన గణనాథులు గంగమ్మ ఒడికి చేరారు. మండల కేంద్రంతోపాటు మాన్‌దొడ్డి, పచ్చర్ల, ముండ్లదిన్నె, పెద్దతాండ్రపాడు తదితర గ్రామాల్లో గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తుంగభద్ర నదిలో నిమజ్జనం చేశారు. సుంకేశుల డ్యాం సమీపంలో గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను సీఐ శివశంకర్‌గౌడ్ పరిశీలించారు.

ఆయన వెంట ఎస్‌ఐ ఖాదర్ బాషా ఉన్నారు.

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండలంలోని పలు గ్రామాల్లో గణేశ్ నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పైపాడులో నిర్వహించిన గణేశ్ శోభాయాత్రలో ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

గట్టు: మండల కేంద్రంలోని ఉప్పరి వీధిలో కొలువుదీరిన గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం గణేశ్ విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ధనలక్ష్మి, వార్డు సభ్యుడు మహదేవ్, వెంకటేష్, గోవిందు, శేఖర్, దేవేందర్, రాజేష్ పాల్గొన్నారు.

ధరూరు: మండలంలోని దోర్నాలలో కొలువుదీరిన గణనాథుడి మండపం వద్ద హోమం నిర్వహించారు.

మానవపాడు: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ప్రతిష్ఠించిన గణనాథుడికి మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పెద్ద ఆముదాలపాడులో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జగన్మోహన్‌నాయుడు, మహ్మద్ సిరాజ్, కృష్ణయ్య పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు నిర్వహించిన కమాండెంట్

ఎర్రవల్లిచౌరస్తా: స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో ఎర్రవల్లి చౌరస్తాలో ప్రతిష్ఠించిన గణనాథుడిని పదో పటాలం కమాండెంట్ సాంబయ్య దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ జోగుల రవి, కృష్ణసాగర్, నర్సింహారెడ్డి, మద్దిలేటి, రాజు, లోకారెడ్డి పాల్గొన్నారు.



రాజోళి మండలం పచ్చర్లలో..



అయిజలో పూజలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ నర్సయ్య



అలంపూర్ మండలం శింగవరంలో..



గట్టులో గణనాథుడికి పూజలు చేస్తున్న భక్తులు

అర్హులందరికీ పథకాలు అందాలి



మాట్లాడుతున్న ఎంపీపీ రాజారెడ్డి

మల్దకల్: పేదల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులందరికీ అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉందని ఎంపీపీ రాజారెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చారు. మద్దెలబండలో మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వైస్ ఎంపీపీ పెద్ద వీరన్న ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. దీనిపై ఏఈ పరమేష్ స్పందిస్తూ.. నీటి సమస్య కలుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. శేషంపల్లిలో విద్యుత్ సమస్యతో అవస్థలు పడుతున్నామని సర్పంచ్ సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై విద్యుత్ ఏఈ దుర్గాప్రసాద్ సానుకూలంగా స్పందించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలన్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా, విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ, తహసీల్దార్ హరికృష్ణ తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



జనార్దన్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

అయిజ: మండలంలోని రాజాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న జనార్దన్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధ్యాయులు శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ జీహెచ్‌ఎంలు రాములు, నర్సింహులు, ఉపాధ్యాయులు బేబి, జగపతిరెడ్డి, బలరాం, సీతారాములు, సర్వేశ్వరాచారి, బసన్న, రమేష్, రవీంద్ర, కృష్ణ పాల్గొన్నారు.

బస్సుల కోసం ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న ప్రయాణికులు, విద్యార్థులు

గద్వాల క్రైం: రాయిచూర్–ఆత్మకూర్ రూట్‌లో విద్యాసంస్థల సమయానుకూలంగా ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో శుక్రవారం రాత్రి విద్యార్థులు, ప్రయాణికులు గద్వాల డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. 2గంటలకు పైగా బస్టాండ్‌లో వేచి ఉన్నా బస్సులు లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యాసంస్థల సమయానికి బస్సులను నడపకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా బస్సుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. దాదాపు అరగంట పాటు నిర్వహించిన ధర్నాతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు డిపో వద్దకు చేరుకొని నచ్చజెప్పారు. కాగా వర్షం కారణంగా బస్సులు కాస్త ఆలస్యమయ్యాయని డీఎం మంజులారెడ్డి తెలిపారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కాంగ్రెస్‌తోనే ప్రజాసంక్షేమం సాధ్యం

గద్వాల అర్బన్: కాంగ్రెస్ పార్టీతోనే ప్రజాసంక్షేమం, అభివృద్ధి సాధ్యమని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ చైర్‌పర్సన్ క్యాంపు కార్యాయలంలో నది అగ్రహారం, కేటీదొడ్డి మండలం కుచినేర్ల గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఆమె పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే గ్రామాలు అన్నివిధాలా అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో విజయ్, లక్ష్మణ్, ఆనంద్‌గౌడ్ పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన వారితో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

ప్రజాదరణ చూసి ఓర్వలేకే ఆరోపణలు



అలంపూర్‌లో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బీఎస్పీ నాయకులు

అలంపూర్: బీఎస్పీకి లభిస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకే కాంగ్రెస్ పార్టీ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్ అన్నారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కాంగ్రెస్ నాయకుడు రాజ్‌బోడ్‌పై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీఎస్పీ బలపడుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ నాయకుడు రాజ్‌బోడ.. ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై మండిపడ్డారు. ప్రవీణ్‌కుమార్ గౌరవానికి భంగం కలిగించే విధంగా వ్యాఖ్యలు చేసిన రాజ్‌బోడ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సుంకన్న, మండల అధ్యక్షుడు సురేష్ పాల్గొన్నారు.

శాంతినగర్: ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాజ్‌బోడను వెంటనే అరెస్ట్ చేయాలని బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి రవిచందర్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమాజంలో అలజడి చెలరేగడానికి కారకుడైన రాజ్‌బోడ యూట్యూబ్ చానల్‌పై కేసు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు విజయ్‌కుమార్, చరణ్, నాగేష్, వెంకటేష్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలి

గద్వాల అర్బన్: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ విజయ్‌కుమార్, కన్వీనర్ పోగుల రాజేష్ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీని నేటికి అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. పార్లమెంట్ సమావేశాలను పొడగించి, ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు.

కేటీదొడ్డి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీస్ జిల్లా కోకన్వీనర్ డేవిడ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని గద్వాల–రాయిచూర్ ప్రధాన రహదారిపై శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. అంతకుముందు బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ బిల్లుపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వకుంటే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో జంబయ్య, తాయప్ప, కర్రెప్ప, నర్సింహులు, విష్ణు, రంగస్వామి, కర్ణప్ప, కోళ్ల రంగప్ప, మాళప్ప తదితరులు పాల్గొన్నారు.



కేటీదొడ్డిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పత్తి రైతులను ఆదుకోవాలి

ధరూరు: జిల్లాలో ఒకవైపు మధ్యవర్తుల దోపిడీ, మరోవైపు కంపెనీల మోసాలతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగ్లళ్ల రంజిత్‌కుమార్ ఆరోపించారు. మండలంలోని కొత్తపాలెం, తండాల్లో రైతులు సాగు చేసిన కావేరి 245 రకం పత్తిపంటను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కావేరి ఫౌండేషన్ సీడ్ నకిలీది కావడం వల్ల పండించిన పంటలో కేవలం పత్తి మాత్రమే ఉందని, అందులో తాలుపోయిన గింజలు ఉన్నాయన్నారు. నడిగడ్డలో ఏటా ఏదో రకంగా రైతులు నష్టపోతున్నా.. అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదన్నారు. నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించడంతోపాటు ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బుచ్చిబాబు, లవన్న, విష్ణు, వెంకట్రాములు, అంజి, పరుశరాముడు, రాము, వీరేష్, జ్ఞానేశ్వర్, భూపతి పాల్గొన్నారు.



కొత్తపాలెంలో మాట్లాడుతున్న రంజిత్‌కుమార్

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె



సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు

గద్వాల అర్బన్: తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారంతో 12వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఏమేలమ్మ మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఉచిత విద్యుత్ అందించాలి



విద్యుత్ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న కేవీపీఎస్ నాయకులు

రాజోళి: దళితులకు 300 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందించాలని కేవీపీఎస్ మండల కార్యదర్శి విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీ, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో దళితులకు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా దళితులకు 300 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. జీవో 342 ప్రకారం దళితులకు 101 యూనిట్లు ఉచితంగా విద్యుత్ అందించాలనే నిబంధన ఉన్నప్పటికీ.. అమలు కావడం లేదన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలి



గద్వాల అర్బన్: అన్ని రాజకీయ పార్టీలు మున్నూరుకాపు సామాజిక వర్గానికి ఎమ్మెల్యే టికెటు కేటాయించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్నూరుకాపు కులస్తులకు రాజకీయంగా అవకాశం కల్పించాలని కోరారు. రాజకీయాల్లో రాణించేందుకు మున్నూరుకాపు కులస్తులందరూ ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నవీన్, శ్రీనివాస్‌రెడ్డి, నల్లారెడ్డి, స్వామి, గణేష్, జనార్దన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యార్థికి అభినందన



గద్వాల రూరల్: మల్దకల్ మండలం అమరవాయికి చెందిన నాగరాజు ఎంబీబీఎస్ సీటు సాధించాడు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే డీకే భరత్‌సింహారెడ్డి విద్యార్థి నాగరాజును శాలువాతో సన్మానించి అభినందించారు. అనంతరం రూ.21వేల ప్రోత్సాహకాన్ని అందజేశారు. కార్యక్రమంలో మురళీధర్‌రెడ్డి, గడ్డం కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బుడ్డన్న పాల్గొన్నారు.

మహిళకు గాయాలు

అలంపూర్: అలంపూర్ చౌరస్తా సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. వడ్డేపల్లి మండలం కొంకలకు చెందిన వేణమ్మ కుటుంబ సభ్యులతో కలిసి బైక్‌పై వెళ్తుండగా, ఉత్తర ఫుడ్స్ కంపెనీ వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న కారును ప్రమాదవశాత్తు ఢీట్టారు. ప్రమాదంలో వేణమ్మకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108లో కర్నూల్‌కు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి



వినతిపత్రం అందజేస్తున్న వాల్మీకులు

గద్వాల రూరల్: వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ శుక్రవారం గద్వాలకు చెందిన వాల్మీకి సంఘం నాయకులు ఢిల్లీలో కేంద్ర గిరిజన వ్యవహారాలశాఖ మంత్రి అర్జున్ ముండకు వినతిపత్రం అందజేశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మాజీ మంత్రి డీకే అరుణ నేతృత్వంలో కేంద్ర మంత్రిని కలిసి తమ సమస్యలను వివరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకటరమణ, రామాంజనేయులు, నాగశంకర్, బోయ రాములు, కావాలి సురేష్, బాలమణెమ్మ పాల్గొన్నారు.

చోరీకి యత్నం

గద్వాల క్రైం: పట్టణంలోని న్యూహౌసింగ్‌బోర్డు, నల్లకుంట కాలనీలో గుర్తుతెలియని దుండగులు శుక్రవారం పలు ఇళ్లల్లో చోరీకి యత్నించారు. వినాయక నిమజ్జనోత్సవంలో కాలనీవాసులు నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో దొంగలు పలు ఇళ్లల్లోకి చొరబడి వస్తువులు, సామగ్రిని చిందరవందరగా పడేశారు. గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరకుని అనుమానిత వ్యక్తులపై ఆరా తీశారు. ఎలాంటి ఆస్తినష్టం చోటుచేసుకోలేదని పట్టణ ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు.